ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
బుధవారం 24 జూలై 2024





బయ్యారంలోని ఇనుప ఖనిజం గుట్టలు

కేంద్రం కనికరించలే!

సెంట్రల్ బడ్జెట్‌లో వరంగల్‌కు మొండిచేయి

- నిర్మలమ్మ పద్దులో నిధుల కేటాయింపులు నిల్
- ఊసులేని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్, కొత్త లైన్లు
- బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ, సైనిక్ స్కూల్ విషయంలోనూ అదే తీరు
- గిరిజన విశ్వవిద్యాలయానికి పైసా విదల్చని కేంద్ర సర్కారు
- మేడారం జాతరకు జాతీయ హోదా ప్రకటన లేదు
- బడ్జెట్ తీరుపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న అసంతృప్తి

7



మూడో సారి కూడా కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టిన ఎన్డీఏ సర్కారు.. బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాపై ఏ మాత్రం కనికరం చూపలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఎన్నికవడంతో ఈ సారి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాల జల్లు కురుస్తుందని భావించారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు కూడా ఎన్నో కొన్ని కేటాయింపులుంటాయని ఆశపడ్డారు. ముఖ్యంగా కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్, కొత్త రైల్వేలైన్లు, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వరంగల్‌లో సైనిక్‌స్కూల్ ఏర్పాటు అంశాలు కచ్చితంగా ఉంటాయని ఆశించారు. కానీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఎనిమిది నెలల కాలానికి గాను మంగళవారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తీరును చూసిన తర్వాత అందరూ నిరాశకు లోనయ్యారు. ఉమ్మడిజిల్లా వాసులు ఆశించిన వాటిలో ఏ ఒక్క అంశానికి సంబంధించి ఊసులేకపోవడం.. కేటాయింపులు లేకపోవడం.. ఏ పథకానికి కూడా నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. నిర్మలమ్మ పద్దుతో తమకు ఒరిగిందేమీ లేదని, మళ్లీ మొండిచేయే చూపారని పెదవి విరుస్తున్నారు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

అక్కపల్లిగూడెంలో మచ్చల దుప్పి ప్రత్యక్షం

జూపార్కులో అప్పగించిన ఫారెస్టు అధికారులు



దుప్పిని హనుమకొండ జూపార్కులో అప్పగిస్తున్న ఫారెస్టు అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 23: అడవిలో, జూపార్కులలో కనిపించే మచ్చల దుప్పి ఘన్‌పూర్ మండలం అక్కపల్లి గూడెం గ్రామ పరిధిలోని దేవాదుల కెనాల్ వద్ద సోమవారం సాయంత్రం ప్రత్యక్షమైంది. కుక్కల దాడిలో స్వల్పంగా గాయపడి కెనాల్ కట్టకు ఏర్పడిన సొరికెలోకి వెళ్లి తలదాచుకుంది. గమనించిన స్థానిక రైతులు మంగళవారం ఉదయం ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్వో) మురళీధర్ ఆదేశాల మేరకు సిబ్బంది వాహనంతో వెళ్లి పట్టుకొచ్చారు. ఘన్‌పూర్ వెటర్నరీ ఆస్పత్రిలో చికిత్స చేయించి హన్మకొండలోని జూ పార్కుకు తీసుకెళ్లి వదిలి పెట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ సమీపంలో ఫారెస్టులు లేవని, రఘునాథపల్లి రిజర్వు ఫారెస్టు నుంచి వచ్చి ఉంటుందని అన్నారు. అడవి జంతువులు కనిపిస్తే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సోమవారం రాత్రి నుంచి దుప్పి కుక్కల బారిన పడకుండా రక్షించిన పెండ్లి ప్రశాంత్ అనే యువకుడిని అభినందించారు. కాగా మచ్చల దుప్పిని చూడడానికి గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ అధికారి ఝరీనా, బీట్ ఆఫీసర్లు కె.రవి, అంజయ్య, బి.అఖిలేష్, వాచర్ ఉప్పలయ్య పాల్గొన్నారు.

మాయా జూదం!

కుటుంబాలను ఆగం చేస్తున్న ఆన్‌లైన్ గేమ్



అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్న యువత
జిల్లాలో ఇప్పటికే ముగ్గురి బలవన్మరణం
అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సరదా కోసం అలవాటు చేసుకున్న ఆన్‌లైన్ గేమ్ కాస్తా ప్రాణాల మీదికి వస్తోంది. ఆట మోజులో పడిన యువకులు అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఈ మాయదారి జూదానికి జిల్లాలో ఇప్పటికే ముగ్గురు యువకులు బలయ్యారు. మరికొందరు అప్పులపాలైతే తల్లిదండ్రులు భూములు అమ్మి అప్పు తీర్చిన సంఘటనలు ఉన్నాయి. సరదాగా రంగంలోకి దిగి.. సీరియస్‌గా మారి.. అనాలోచితంగా అప్పులు చేసి వాటిని ఎలా తీర్చాలో తెలియక.. ఎవరికీ చెప్పుకోలేక అందోళనతో బలవన్మరణానికి పాల్పడుతూ కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్న సంఘటనలు ఉన్నాయి.


రఘునాథపల్లి, జూలై 23: కొత్తగా పుట్టుకొచ్చిన ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడి.. అడ్డదారిలో అనతికాలంలో సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో యువకులు పక్కదారి పడుతున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పెట్టి ఆడిన వారు నిండా మునిగిపోతున్నారు. ఆన్‌లైన్ గేమ్ నిర్వాహకులకు ఆదాయం మాత్రం మూడు పువ్వులు..ఆరు కాయలుగా వస్తోంది. పోయిన డబ్బు మళ్లీ గెలువవచ్చన్న దురాశతో మళ్లీ..మళ్లీ ఆడి తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఆన్‌లైన్ గేమ్ ఆడిన వారు మునుగుతున్నారే తప్పా లాభపడిన దాఖలాలు లేవు. ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటుపడిన వారు పనీపాట వదిలేసి పొద్దు..మాపు అదే ధ్యాసలో ఉంటూ అప్పులపాలై మనోధైర్యం కోల్పోతూ జీవితాలను అర్థాంతరంగా ముగిస్తున్నారు. వారిపై ఆధారపడిన కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగులుస్తున్నారు.

మచ్చుకు కొన్ని సంఘటనలు..



నజీర్ (ఫైల్)

- రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన భైరగోని నజీర్ బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూ ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటు పడి అప్పులు చేసి.. అవి తీర్చే మార్గం కనిపించకపోవడంతో 8 జనవరి 2023న ఇంట్లో ఉరేసుకొని చనిపోయాడు.
- రఘునాథపల్లి మండల కేంద్రానికి చెం దిన సిరికొండ మురళి ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటు పడి రూ.30 లక్షల వరకు అప్పులు చేసి తీర్చలేక అయిదు నెలల క్రితం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొని భార్య, పిల్లలను ఆగం చేశాడు.
- అదేకోవలో రఘునాథపల్లికి చెందిన ద్యావర రాజు అనే రైల్వే ఉద్యోగి ఆన్‌లైన్ గేమ్‌లో రూ.20 లక్షల వరకు పోగొట్టుకొని అప్పులపాలై తాను పని చేస్తున్న స్టేషన్ పరిధిలోనే 15 జూలై 2024న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తన భార్య పిల్లలకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చాడు.



రాజు (ఫైల్)

- మండల కేంద్రానికి చెందిన ఒక రైతు కుమారుడు హైదరాబాద్‌లో ఉంటూ ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటు పడి రూ.40 లక్షల వరకు అప్పు చేయగా, సదరు రైతు తనకున్న వ్యవసాయ భూమిని అమ్మి అప్పులు తీర్చాడు.
- మండల కేంద్రానికి చెందిన పాన్ బ్రోకర్ షాపు యాజమాని కుమారుడు ఆన్‌లైన్ గేమ్‌కు బానిసై రూ.1.40 కోట్ల అప్పు చేసి పారిపోవడంతో తండ్రి విలవిలలాడుతున్నాడు. ఇవి కేవలం బయటపడిన సంఘటనలు మాత్రమే. బయటకు రానివి ఇలాంటివి మరెన్నో ఉన్నాయి.

దగా చేస్తున్న ఆన్‌లైన్ ముఠా..

కొందరు ముఠాగా ఏర్పడి ఆన్‌లైన్ సైట్‌లో

మిగతా 8వ పేజీలో...

26న జిల్లాకేంద్రంలో జాబ్‌మేళా

జనగామ కల్చరల్, జూలై 23: నిరుద్యోగ యువతకు ఈ నెల 26న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంచీపురంలోని ఎల్అండ్‌టీ-సీఎస్టీఐ కంపెనీలో ఐటీఐ అర్హతతో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ప్రకటిం చారు. ఫామ్ వర్క్ కార్పెంటరీ (కార్పెంటర్/ఫిట్టర్/డ్రాఫ్ట్‌మ్యాన్-సివిల్), మాసోర్నీ (మాసన్/బిల్డింగ్ కనస్ట్రక్టర్/డ్రాఫ్ట్‌మ్యాన్-సివిల్), బార్ బెండింగ్ అండ్ స్టీల్ ఫిక్సింగ్ (ఫిట్టర్/డ్రాఫ్ట్‌మ్యాన్-సివిల్), కనస్ట్రక్షన్ ఎలక్ట్రీషియన్ (ఎలక్ట్రీషియన్/వైర్‌మెన్), వెల్డింగ్ (వెల్డర్), ప్లంబింగ్ అండ్ సానిటరీ (ప్లంబర్), స్కాఫోల్డింగ్ ట్రేడ్ (కార్పెంటర్/ఫిట్టర్/డ్రాఫ్ట్‌మ్యాన్-సివిల్) పోస్టులకు అర్హ త గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కో ట్రేడ్‌లో 50 ఖాళీలు ఉన్నాయని, అర్హత, ఆసక్తి గల నిరుద్యోగులు ఈ నెల 26న (శుక్రవారం) ఉదయం 10.30 గం.లకు జిల్లా కేంద్రంలోని ఏకశిల ఐటీఐలో నిర్వహించే జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 79954 30401 నంబరులో సంప్రదించాలన్నారు.

బాలసదనంలో కలెక్టర్ తనిఖీలు

జనగామ రూరల్, జూలై 23: జిల్లా కేంద్రంలోని బాల సదనాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గదులను పరిశీలించి పిల్లలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెనూ ప్రకారం చిన్నారులకు ఆహారం అందించాలన్నారు. సీసీ కెమెరాలను సక్రమంగా పని చేసేలా చూడాలని, నైట్ వాచ్‌మన్ సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు తప్పకుండా ఉండాలన్నారు. బాల సదనం బిల్డింగ్‌లో పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి జయంతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికాంత్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై పట్టింపేదీ?

అధికారులకు చెప్పినా పనులు కావడంలేదు
మునిసిపల్ సాధారణ సమావేశంలో కౌన్సిలర్ల ఏకరువు

జనగామ, జూలై 23(ఆంధ్రజ్యోతి): జనగామ పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంపై కౌన్సిలర్లు మండిపడ్డారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పోకల జమున అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొనగా సానిటేషన్ పనులపై సభ్యులు సభలో ఏకరువు పెట్టారు. 2వ వార్డు కౌన్సిలర్ అనిత మాట్లాడుతూ సానిటేషన్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారని, వార్డులో మునిసిపల్ కమిషనర్ పర్యటించడ ం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 4వ వార్డు కౌన్సిలర్ సుమలత మాట్లాడుతూ వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త మాట్లాడుతూ సమావేశానికి అధికారులు రావడం లేదని, దాని వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, కొంతమంది కార్మికులకు ఈఎస్ఐ కార్డులు అందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వంగాల కళ్యాణి మాట్లాడుతూ సానిటేషన్ వర్కర్లు పూర్తి స్థాయిలో పని చేయడం లేదన్నారు. బండ పద్మ మాట్లాడుతూ వార్డులో లేబర్ సరిగా లేకపోవడం వల్ల పనులు కావడం లేదని, తన వార్డుకు కార్మికుల సంఖ్యను పెంచాలని అన్నారు. అదే విధంగా పోచమ్మ టెంపుల్ వద్ద గుంతల రోడ్డు వల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతోందన్నారు. ఉడుగుల శ్రీలత మాట్లాడుతూ వార్డు పరిధిలో స్లమ్ ఏరియా ఎక్కువగా ఉందని, నీటి సమస్య ఉందని,





సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, సమస్యలపై నిలదీస్తున్న కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా

వెంటనే వాటర్ ట్యాంకు నిర్మించాలని కోరారు. రాంచందర్ మాట్లాడుతూ పట్టణంలో మొక్కలు, పూల చెట్లను ఎక్కువగా నాటాలని కోరారు. గుర్రం భూలక్ష్మి మాట్లాడుతూ తన వార్డు పరిధిలో రైల్వే అండర్ గ్రౌండ్ వద్ద పనులు పూర్తి కాలేదని, సగం పనులు చేసి వదిలివేశారని అన్నారు. వెంటనే పూర్తి స్థాయిలో పనులు చేయాలని కోరారు. మల్లిగారి చంద్రకళ మాట్లాడుతూ వార్డు పరిధిలో అభివృద్ధి పనులు జరగడం లేదని, సానిటేషన్ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే పరిష్కరించాలని కోరారు. పాక రమ మాట్లాడుతూ వార్డులో అండర్ రైల్వే బ్రిడ్జి నుంచి మురికినీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఈ విషయమై ఎన్నో సార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ సమావేశానికి రాని అధికారులను వివరణ కోరాలని కమిషనర్‌ను ఆదేశించారు. వారిపై చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మేనేజర్ రాములు, ఏఈ మహిపాల్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 22 ఎజెండాలు, 10 అదనపు ఎజెండాలు ఆమోదించారు.

నోరు జారిన కమిషనర్: కౌన్సిలర్ల ఆగ్రహం

కౌన్సిల్ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నోరు జారారు. సమావేశానికి అధికారుల గైర్హాజరు పై ఓ మహిళా కౌన్సిలర్ అడిగిన ప్రశ్నకు కమిషనర్ దురుసుగా జవాబిచ్చారు. పట్టణంలో కమిషనర్‌తో పాటు ఏ అధికారులు కూడా వార్డుల పర్యవేక్షణ సరిగ్గా చేయడం లేదని మహిళా కౌన్సిలర్లు మాట్లాడుతుంగా కమిషనర్ స్పందిస్తూ 'మీ ఇంటికి రావాలా' అంటూ నోరు పారేసుకున్నారు. దీనిపై కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కమిషనర్ కౌన్సిలర్లకు క్షమాపణ చెప్పాల్సి వచ్చింది.



అంగట్లో ఆడ శిశువు

రూ 1.80లక్షలకు విక్రయించిన తల్లిదండ్రులు
శిశు సంరక్షణ కేంద్రానికి తరలించిన అధికారులు



ఆడ శిశువును ఐసీడీఎస్ సీడీపీవోకు అప్పగిస్తున్న సీఐ ముస్క రాజు, ఎస్సై నాగరాజు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 23: ఐదో సంతానంగా జన్మించిన ఆడ శిశువును తల్లిదండ్రులు విక్రయించిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన బెల్లం గట్టువ్వా-రమేష్ దంపతులకు నెల రోజుల క్రితం ఆడ శిశువు జన్మించింది. వారికి అప్పటికే ముగ్గురు ఆడపిల్లలు, ఒక బాలుడు ఉండగా గతంలో కూడా ఓ అడ శిశువును విక్రయించారు. ప్రస్తుతం ఐదో సంతానంగా జన్మించిన ఆడ శిశువును ఎలాగైనా విక్రయించాలని తలచి తోకల రజిత, రజాక్‌యాదవ్‌ల సహకారంతో ఈ నెల 18న మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన ఓ దంపతులకు రూ.1,80,000లకు విక్రయించారు. కాగా ఘన్‌పూర్ అంగన్‌వాడి సెంటర్-9 నిర్వాహకురాలు సునీత శిశువుకు సంబంధించిన వివరాల నమోదు చేయడానికి వారి ఇంటికి వెళ్లగా శిశువు కనిపించకపోవడంతో పాటు తల్లిదండ్రులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి ఈ విషయాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సీడీపీవోలకు తెలియపరిచారు. వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తల్లిదండ్రులను పిలిపించి విచారణ జరుపగా శిశువును విక్రయించిన విషయాన్ని ఒప్పుకున్నారు. అనంతరం శిశువును కొనుగోలు చేసిన దంపతులను పిలిపించి నలుగురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. శిశువులను విక్రయంచడం.. కొనుగోలు చేయడం నేరమని హెచ్చరించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఫ్లోరెన్స్, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బాధ్యుల సమక్షంలో శిశువును వారికి అప్పగించారు. వారు హన్మకొండలోని శిశుసంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ ఘటనలో ఇరువైపులా దంపతులతో పాటు ఇద్దరు మధ్యవర్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముస్క రాజు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికాంత్, స్వప్నరాణి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.





నేటి నుంచి రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు













వరంగల్ స్పోర్ట్స్, జూలై 23: ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈ నెల 26 వరకు మూడు రోజుల పాటు వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ వేదికగా 10వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అండర్-17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన క్వాలిఫైయింగ్ రౌండ్‌లో వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారుల నుంచి 26మంది మెయిన్ డ్రాకు అర్హత సాధించినట్లు తెలిపారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్‌డబుల్స్ విభాగాల్లో మూడు రోజులు పాటు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న బ్యాడ్మింటన్ పోటీలలో ఉమ్మడి పది జిల్లాల నుంచి క్వాలిఫైయింగ్ రౌండ్‌లో అర్హత సాధించిన వారితో కలిపి మొత్తం 146మంది క్రీడాకారులు మెయిన్ డ్రా పోటీలో పాల్గొంటారన్నారు. వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌తోపాటు ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనునన్న ఈ టోర్నీలో 15మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారన్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ దిగ్గజాలు కిదాంబి నందగోపాల్, విద్యాధర్, వరంగల్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి వసతులను కల్పించనున్నామన్నారు. అదేవిధంగా ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో కేరళలో జరగనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి. రమేష్‌కుమార్, టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి డాక్టర్ జితేందర్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, కోచ్‌లు పాల్గొన్నారు.


అధ్యాపకుడికి ఆర్థిక సహాయం

కేయూ క్యాంపస్, జూలై 23: అనారోగ్యంతో బాధపడుతున్న గణితశాస్త్ర అధ్యాపకుడు తాటిపాముల తిలక్‌కు గణితశాస్త్ర విభాగం మిత్రులు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందచేసి తమ సహృదయాన్ని చాటుకున్నారు. మహబూబాబాద్‌కు చెందిన గణితశాస్త్ర ప్రైవేట్ అధ్యాపకుడు తిలక్ తల్లి ఇటీవల చనిపోవడం, తన తండ్రి తిలక్ 18వ ఏటనే చనిపోవడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులలో ఉంది. దీనికి తోడు ఇటీవల తిలక్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో కేయూ రిజిస్ట్రార్, గణితశాస్త్రవిభాగం ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి తోడ్పాటుతో గణితశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.నాగయ్య, సతీశ్, యాకూబ్ పాషాలు కలిసి మిత్రులతో కలిసి తిలక్ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందచేశారు. అలాగే మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌కు తిలక్ కుటుంబ పరిస్థితిని విన్నవించి ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. తిలక్ కుటుంబానికి కనీసం రేషన్ కార్డు లేదని, పేదరికంతో ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. తిలక్ ఆర్థిక సహాయం చేసిన వారిలో రమేశ్, నరేశ్, భాస్కర్, నరహరి, యుగేందర్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలను చూపి ఆదాయ పన్ను చెల్లించాలి

హనుమకొండ టౌన్, జూలై 23: వాస్తవాలను చూపి ఆదాయం పన్ను చెల్లించాలని అసిస్టెంట్ కమిషనర్ ఇన్‌కామ్ టాక్స్ రేంజ్-3 హైద్రాబాద్ ఎన్. సీతారామాంజనేయులు అన్నారు. మంగళవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో ఎన్పీడీసీఎల్ అకౌంట్స్ ఆఫీసర్లు, డ్రాయింగ్ ఆఫీసర్లు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్, డీసీబీ, ఏపీజీవీబీ బ్యాంకు అధికారులకు ఆదాయపన్నుపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ.. సీఏల దగ్గర కొంత మంది ఆదాయపన్ను ఫైలింగ్ విధానం నేర్చుకొని నగదు రీఫండ్ వచ్చేలా తప్పుడు ఫైలింగ్ చేస్తున్నారని, అలా చేయడం వల్ల జరిమానా విధించనున్నట్లు చెప్పారు. తిరిగి మరలా సవరించే వెసులుబాటు కల్పించామని, 2022-23 ఆర్థిక సంవత్సరానికి 50 శాతం వడ్డీ, 2023-24 ఆర్థిక సంవత్సరానికి 25 శాతం వడ్డీతో మరలా ఫైలింగ్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ వి.తిరుపతిరెడ్డి, జీఎంలు దేవేందర్, వేణుబాబు, సత్యనారాయణ, ఆదాయ పన్ను అధికారులు అవినాశ్, ఎన్పీడీసీఎల్ అకౌంట్స్ ఆఫీసర్లు డ్రాయింగ్ ఆఫీసర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.







కేంద్రం కనికరించలే!

- సెంట్రల్ బడ్జెట్‌లో వరంగల్‌కు మొండిచేయి
- నిర్మలమ్మ పద్దులో నిధుల కేటాయింపులు నిల్
- బడ్జెట్ తీరుపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న అసంతృప్తి



హనుమకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ సర్కారు ఉమ్మడి వరంగల్ జిల్లాకు మొండిచేయే చూపింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఎనిమిది నెలలకాలానికి గాను మంగళవారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ సారి రాష్ట్రం నుంచి బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రానికి బడ్జెట్‌లో కేంద్రం పెద్ద పీట వేస్తుందని భావించారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు కూడా ఎన్నో కొన్ని కేటాయింపులుంటాయనుకున్నారు. కానీ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్న ఏ ఒక్క అంశమూ, పథకమూ లేకపోవడంతో అందరూ నిరాశకు గురయ్యారు. నిర్మలమ్మ పద్దుతో తమకు ఏం ఒరగలేదని ఉమ్మడి జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు.

బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ మాటేదీ?

రాష్ట్రాల విభజన హామీలో ఒకటైన మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు అంశం కూడా కేంద్ర బడ్జెట్‌లో కనిపించలేదు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఈ నాటిది కాదు. రెండు దశబ్దాలుగా ఇది నలుగుతోంది. దీనిపై స్థానిక ప్రజలు ఎన్నో సార్లు ఆందోళన చేశారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఈ అంశం చర్చకు వస్తుంది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా ప్రస్తావనకు వచ్చింది. బీజేపీ అగ్రనేతలు సైతం తమ పార్టీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే బయ్యారం ఉక్కువ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ కూడా ఇచ్చారు. బీజేపీ ముచ్చటగా మూడోసారి తిరిగి అధికారంలో రావడంతో ఉక్కు ఫ్యాక్టరీ కల నెరవేరుతుందని స్థానిక ప్రజలు ఎంతగానో ఆశించారు. కానీ బడ్జెట్‌లో ఈ అంశాన్నే ప్రస్తావించకపోవడంతో నిరాశకు లోనయ్యారు.

గిరిజన విశ్వవిద్యాలయం

ములుగులో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న గిరిజన విశ్వవిద్యాలయానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ములుగు జిల్లా జాకారం వద్ద ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు పనులు గత సంవత్సరమే ప్రారంభమయ్యాయి. ఈవిద్యాసంవత్సరం నుంచే తరగతులు మొదలు కావలసి ఉండింది. జాకారంలోని వైటీసీ భవనంలో తాత్కాలికం గా తరగతులను నిర్వహించేందుకు సన్నాహాలు మొదల య్యాయి. విశ్వవిద్యాలయం ఏర్పాటు పర్యవేక్షణకు ఒక ప్రత్యేకాధికారిని కూడా నియమించారు. దీని నిర్వహణ బాధ్యతను హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయానికి అప్పగించారు. కానీ విశ్వవిద్యాలయం ఏర్పాటు పనులు పూర్తికి అవసరమైన నిధుల కేటాయింపు ప్రస్తావన మాత్రం బడ్జెట్‌లో చేయలేదు. దీనితో విశ్వవిద్యాలయం నిర్వహణపై నీలినీడలు పరుచుకున్నాయి. నిధులలేమి వల్ల విశ్వవిద్యాలయం పనుల పూర్తికి మరింత జాప్యం జరగవచ్చు.



కోచ్‌ఫ్యాక్టరీ ఏమైంది?

ఎంతో కాలంగా వరంగల్ ప్రజలు డిమాండ్ చేస్తున్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి ఈ సారి కూడా మోక్షం కలుగలేదు. కేంద్ర బడ్జెట్‌లో దీని ప్రస్తావనే లేదు. రెండు దశబ్దాలుగా వరంగల్ ప్రజలు కోచ్ ఫ్యాక్టరీ కోసం పోరాటం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఈ అంశం ప్రధాన ఎజెండాగా నిలుస్తూ వచ్చింది. ఓటర్లను ఆకర్షించేందుకు కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రకటనలు చేయడం మినహా.. ఇప్పటివరకు ఈ కల సాకారం కాలేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి బదులు ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాపు ఏర్పాటుతో సరిపెట్టింది. అయినప్పటికీ కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ ఇప్పటికీ సజీవంగానే ఉంది. దీంతో ప్రతీసారి బడ్జెట్‌లో ఈ ఫ్యాక్టరీ ప్రస్తావన ఉంటుందన్న ఆశతో ప్రజలు ఎదురుచూడడం.. చివరకు నిరాశకు గురికావడం పరిపాటిగా మారింది. ఈ సారి కూడా అదే జరిగింది.

కాజీపేట రైల్వే డివిజన్ అంతే..

బడ్జెట్‌లో కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా మార్చాలన్న ప్రతిపాదన కూడా బడ్జెట్‌లో కనిపించలేదు. ఉత్తర, దక్షిణభారత దేశాలను కలిపే అతిపెద్ద రైల్వే జంక్షన్ అయిన కాజీపేటను డివిజన్‌గా మార్చాలన్న ప్రతిపాదన చాలా ఏళ్లనాటిది. దీనిపై అనేకసార్లు పోరాటాలు కూడా జరిగాయి. డివిజన్ కేంద్రంగా మారిస్తే కాజీపేట జంక్షన్ రూపురేఖలు మారుతాయి. రవాణా, వ్యాపార, వాణిజ్యపరంగా ఈప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. రైల్వే డివిజన్‌గా ఉన్నతీకరించడానికి కాజీపేట జంక్షన్‌కు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోవడం లేదు. దీంతో డివిజన్ కల కలగానే మిగిలిపోయింది. ఈసారి బడ్జెట్‌లో కూడా ఆఊసే లేకపోవడంతో జిల్లా ప్రజలు ఉసూరుమంటున్నారు.

కొత్త రైల్వే లైన్లు..

వరంగల్ జిల్లాకు సంబంధించిన కొత్త రైల్వే లైన్లు, ప్రాజెక్టులు, ఆధునీకరణ పనులకు ప్రతిపాదనలు కూడా నిర్మలమ్మ బడ్జెట్‌లో చోటు దక్కలేదు. కాజీపేట మీదుగా కొన్ని రైల్వేలైన్ల డిమాండ్ చాలా కాలంగా ఉంది. వాటి ప్రస్తావన లేదు. కాజీపేట - భూపాలపల్లి రైల్వే, అలాగే రామగుండం - మణుగూరు వయా భూపాలపల్లి రైల్వేప్రతిపాదనలు వీటిలో కొన్ని. ఇందులో రామగుండం - మణుగూరు రైల్వే లైన్ సర్వేకు గత బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించారు. ప్రస్తుత బడ్జెట్‌లో వీటి ఊసేలేకపోవడంతో కేంద్రం రైల్వే ప్రాజెక్టుల విషయంలో మరోసారి మొండి చేయి చూపినట్లు అయింది.

సైనిక్ స్కూల్ ఏమైంది!

హనుమకొండ జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అంశం కూడా కేంద్ర బడ్జెట్‌లో కానరాలేదు. జిల్లాకు సైనిక్ స్కూల్ మంజూరు గతంలోనే జరిగింది. మడికొండ సమీపంలో దీని ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇందుకు అవసరమైన స్థలం కేటాయింపునకు గత ప్రభుత్వం ముందుకు వచ్చింది. కానీ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల సైనిక్‌స్కూల్ ఏర్పాటులో ఐదేళ్లుగా జాప్యం జరుగుతోంది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా ప్రధాన ప్రచార అంశంగా చర్చకు వచ్చింది. వరంగల్ ఎంపీగా గెలిచిన డాక్టర్ కావ్య సైతం ఈ అంశాన్ని లోక్‌సభలో చర్చిస్తానని చెప్పారు. దీనిపై కేంద్రానికి లేఖ రాస్తానన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా బీజేపీ అగ్రనేతలు సైనిక్ స్కూల్ ఏర్పాటుపై హామీ ఇచ్చారు. తీరా బడ్జెట్‌లో చూస్తే ఆ ఊసే లేదు.

కాళేశ్వరానికి జాతీయ హోదా ఎప్పుడు?

తెలంగాణ రాష్ట్రంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులైన కాళేశ్వరం, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులలో ఏదైనా ఒకదానికి జాతీయ హోదా ఇవ్వాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ దిశగా కేంద్రంతో చర్చించింది. అయినా కూడా కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశం బడ్జెట్‌లో కనిపించలేదు.

విమానాశ్రయం ఊసేలేదు



ఉడాన్ పథకం కింద మామునూరులోని విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలన్న అంశానికి కూడా బడ్జెట్‌లో చోటు దక్కలేదు. ఉడాన్ పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలో భాగంగా మామునూరు ఎయిర్‌పోర్టు విస్తరణ అంశం చాలా ఏళ్ల నుంచి నలుగుతోంది. విమానాశ్రయాన్ని త్వరలో అభివృద్ధి చేయనున్నట్లు ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. సర్వేలు కూడా జరిగాయి. ఇందుకు అవసరమైన భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చింది. అయితే కేంద్ర విమానాయాన మంత్రిత్వ శాఖ ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. బడ్జెట్‌లో ప్రతిపాదిస్తే అభివృద్ధికి ముందడుగుపడేది. కానీ ఈసారి బడ్జెట్‌లో ఆ అవకాశమే కల్పించలేదు.

అవీ ఇవీ..

మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి కేంద్రం తన వంతుగా ఈ సారి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని ఉమ్మడి జిల్లా ప్రజలు పడిన ఆశ నిరాశే అయింది. ఈ పార్క్‌కు కేంద్రం తన వంతు వాటాగా రూ.500 కోట్లను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. హైదరాబాద్ - వరంగల్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు అంశం కూడా బడ్జెట్‌లో కనిపించలేదు. వరంగల్ నగరంలో ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి గత ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన నియో రైతు ప్రాజెక్టుకు కేంద్రం తనవంతుగా సమకూర్చాల్సిన నిధుల ప్రస్తావన కూడా బడ్జెట్‌లో పేర్కొనలేదు.



మేడారానికి జాతీయ పండుగ గుర్తింపు డిమాండ్‌ను పట్టించుకోలే..

మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను జాతీయ పండుగగా కేంద్ర ప్రభుత్వం గుర్తించాలన్న డిమాండ్ కూడా చాలాకాలంగా జిల్లా ప్రజలు చేస్తున్నారు. మేడారం ఆసియా లోకెల్లా అతిపెద్ద జాతర. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి సైతం కోటిన్నర మందికిపైగా భక్తులు హాజరవుతుంటారు. చారిత్రకంగా, ఆదివాసీ సంప్రదాయంపరంగా విశిష్టత, ఔన్నత్యం ఉన్న ఈ జాతరను స్టేట్ ఫెస్టివల్‌గా గతంలోనే ప్రకటించినప్పటికీ నేషనల్ ఫెస్టివల్‌గా చేయాలన్న డిమాండ్‌ను జిల్లా ప్రజలు చాలా కాలంగా చేస్తున్నారు. జాతర జరిగిన ప్రతీసారి ఈ డిమాండ్ ప్రధానంగా చర్చకు వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు కూడా పంపింది. ఈ విషయంలో కేంద్రం వద్ద పరిశీలనలో ఉంది. ఈ యేడు ఫిబ్రవరిలో జాతర జరిగిన సందర్భంలో వనదేవతలను దర్శించుకునేందుకు వచ్చిన బీజేపీ అగ్రనేతలు మేడారం జాతరను నేషనల్ ఫెస్టివల్‌గా ప్రకటించేలా కృషి చేస్తామని హామీలు గుప్పించారు. అప్పుడు కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి సైతం ఈ మేరకు వాగ్దానం చేశారు. కానీ దానిని ఎన్‌డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రస్తావించడం ద్వారా నెరవేర్చే దిశగా ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో జిల్లా ప్రజలు, ముఖ్యంగా ఆదివాసీలు మరోసారి నిరాశకు గురయ్యారు.

ఇది 'కుర్సీ బచావో' బడ్జెట్

డాక్టర్ కడియం కావ్య, వరంగల్ ఎంపీ



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. 'కుర్సీ బచావ్ బడ్జెట్'. ఎన్డీఏ ప్రభుత్వం నిలబడడానికి బిహార్, ఆంధ్రప్రదేశ్‌లకు తాయిలాలు ఇచ్చింది. తమ కూటమిని నిలుపుకొనేందుకు బీజేపీ సంతృప్తివాద రాజకీయాలు అనుసరిస్తోంది. ఇదంతా బీజేపీ క్విడ్ ప్రోకో వ్యవస్థను నడుపుతున్నట్లు ఉంది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఎలాంటి కేటాయింపులు లేకపోవడం బాధాకరం. గత పదేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయి. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించడం లాంటివాటిపై పట్టింపేలేదు. తెలంగాణ పుట్టుకను ఇష్టపడని ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంపై వివక్ష చూపుతూనే ఉన్నారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మరోసారి రాష్ట్రానికి మొండి చేయి చూపి.. వివక్షను కొనసాగించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు బీజేపీ ఎంపీలు దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ అన్యాయాన్ని పార్లమెంట్ వేదికగా ప్రశ్నిస్తాం. రాష్ట్రానికి నిధుల కేటాంపులో జరిగిన వివక్షపై నిలదీస్తాం.

రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ ఊసేలేదు

జంగా రాఘవరెడ్డి, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్



కేంద్ర బడ్జెట్‌లో కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఊసే లేకపోవడం నిరాశకు గురిచేసింది. కేంద్ర సర్కారు జిల్లాకే కాకుండా తెలంగాణకు కూడా తీవ్ర అన్యాయం చేసింది. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా బడ్జెట్‌లో మాత్రం రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా నిధులు కేటాయించకుండా నిరాశ మిగిల్చింది. ఈ బడ్జెట్‌లో బిహార్, ఏపీకి మాత్రమే నిధులు కేటాయించి పక్షపాతం చూపింది. రాష్ట్ర విభజనలో భాగంగా ఇచ్చిన 35 హామీలు, ములుగు గిరిజన యూనివర్సిటీకి అదనపు నిధులు, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదాను తుంగలో తొక్కింది. ఇప్పుడు రాష్ట్రానికి చెందిన బీజేపీ మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ ఏముఖం పెట్టుకుని ప్రజల్లో తిరుగుతారు? రాబోయే ఎన్నికల్లో బీజేపీని బొందపెడతారు.

బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి..

నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే



రాష్ట్ర ప్రజలు బీజేపీకి చెందిన ఎనిమిది మందిని ఎంపీలను గెలిపించారు. కానీ కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు, వనరుల రూపంలోనూ మొండి చేయే చూపింది. దీనికి బాధ్యత వహిస్తూ ఆ ఎంపీలంతా వెంటనే రాజీనామా చేయాలి. బడ్జెట్‌పై రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటే వారిని కేంద్రం వంచించింది. ఇక ఓరుగల్లు జిల్లాకు సంబంధించిన విభజన హామీలను కేంద్రం విస్మరించింది. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, జంక్షన్, నాలగో రైల్వేలైన్, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, జాతీయ రహదారుల విస్తరణ ఊసే లేదు. రాష్ట్రానికి నిధులు తేవడంలో బీజేపీ ఎంపీలు విఫలమయ్యారు. వారు ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలి.

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

బొట్ల చక్రపాణి, సీపీఎం హనుమకొండ కార్యదర్శి



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ ప్రస్తావనే లేదు. బీజేపీ తన రాజకీయ మనుగడ కోసమే బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అధిక కేటాయింపులు చేసింది. దేశంలో అత్యంత కీలకమైన వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించారు. వేతన జీవుల ఆశలను అడియాశలు చేసింది. 40లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు కానీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం వల్ల ఎలా సాధ్యమవుతుంది. బాలింతలకు పౌష్టికాహారం అందించే పోషణ్ పథకం నిధులకు కోత పెట్టారు. దేశంలోని కార్పొరేట్ శక్తులకు పన్నులు వేయకుండా 20 లక్షలలోపు ఆదాయం ఉండే మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం మోపారు.



రాష్ట్రానికిచ్చిన హామీలను మరిచారు..

తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి మొండిచేయి చూపారు. విభజన హామీలైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, రాష్ట్రానికి నిధులు రాబట్టలేక పోయిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి. అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన ప్రధాని కొన్ని రాష్ట్రాలకే నిధులు కేటాయించి తెలంగాణకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించడాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం.

ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఊతం

జలగం రంజిత్‌రావు, బీజేపీ నాయకులు



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవా రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దేశం లోని యువతకు ఉపాధి అవకా శాలు మెరుగు పరుస్తూ ఉద్యోగావకాశాలకు ఊతమిచ్చే దిగా ఉంది. కేంద్ర బడ్జెట్ మహిళలు, యువతకు సాధికార త కల్పించే దిశగా అడుగులేసింది. భారతీయ ఆకాంక్ష లు, విశ్వాసానికి కేంద్ర బడ్జెట్ ప్రతిబింబంలా నిలిచింది. ప్రజా అనుకూల, అభివృద్ధి సానుకూల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి మార్గదర్శక బడ్జెట్‌ను ప్రవేశట్టి భారత్ అభివృద్ధికి బంగారు బాటలు వేశారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఎంప్లాయిమెంట్ బేస్ట్ స్కీమ్ ద్వారా కొత్త ఉద్యోగాల కల్పనకు బాటలు వేసింది. ముద్ర రుణాల పరిధిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలనుకునే యువతకు చేయూతనందించింది. ఎంఎస్ఎంఈలకు రుణాలను అందించే కొత్త పథకాన్ని ఈ బడ్జెట్‌లో పొందు పరిచారు. బంగారం, వెండిపై కస్టమ్స్ డ్యూటీని ఆరు శాతానికి, ప్లాటీనంపై 6.4 శాతానికి తగ్గించడంతో బంగారు, వెండి, ప్లాటీనం ఆభరణాల ధరలు తగ్గుతాయి. క్యాన్సర్ ఔషధాలు, ఎక్స్‌రే మిషన్లపై ట్యాక్స్ తగ్గించడం వైద్య రంగానికి అనుకూలంతో పాటు పేదలకు వైద్యం అందే అవకాశం ఉంది. బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేడయం హర్షణీయం.

బడ్జెట్‌లో తెలంగాణ పదమే ఉచ్చరించలేదు

ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు



కేంద్రం.. బడ్జెట్‌లో తెలంగాణ పదమే ఉచ్చరించలేదు. రాష్ట్రం నుంచి బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలున్నా రాష్ట్రానికి అన్యాయమే జరిగింది. బడ్జెట్‌లో తెలంగాణకు ఏమైనా నిధులు ప్రకటిస్తారని ఎదురు చూసిన ప్రజల నోట్లో ప్రధాని మోదీ మట్టికొట్టారు. రూ.48.21లక్షల కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కేవలం బిహార్, ఆంధ్రప్రదేశ్‌కే పెద్దపీట వేశారు. తెలంగాణలోని పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుల ఊసేలేదు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ మాటే ఎత్తలేదు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, సంజయ్ ఏం చేస్తున్నారు? రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేస్తోందన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. అవకాశం వచ్చినప్పుడు వాత పెట్టడం ఖాయం.

ఉద్యోగస్తులకు నిరాశను మిగిల్చింది

టీఆర్‌టీఎఫ్ జిల్లా చీఫ్ పాటర్న్ లకిరెడ్డి సంజీవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాసిరిరాజి బాపురావు




కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగస్తులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగస్తులను కేంద్ర బడ్జెట్ ఉసూరు మనిపించింది. గత పదేళ్లుగా ఊరట కల్పిస్తారని ఎదురు చూస్తున్న ఉద్యోగులకు బీజేపీ ప్రభుత్వం ఈ ఏడాది నిరాశనే మిగిల్చింది. భారీ ఊరట లభిస్తుందనుకున్న ఉద్యోగులకు ఎలాంటి ఊరట లభించలేదు. పాత పన్ను విధానంలో ఎలాంటి మినహాయింపు లేకుండా పోయింది. బడ్జెట్ ద్వారా కొత్త పన్ను విధానాలను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

విద్యారంగానికి ప్రాధాన్యమేదీ?

డి.శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



రూ.48.21 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు 1.26 లక్షల కోట్లు మాత్రమే. గత సంవత్సరం బడ్జెట్ 1.12 లక్షల కోట్లు కాగా ఈ సంవత్సరం కొంత మేర పెరిగినప్పటికీ ఇది మొత్తం బడ్జెట్‌లో 2.59 శాతమే. ఈ నిధులు ఏ మాత్రం విద్యాభివృద్ధికి సరిపోవు. బడ్జెట్‌లో విద్యకు కనీసం 6 శాతం కేటాయిస్తేనే విద్యాసంస్థలకు మౌలిక వసతులు కల్పించగలం, కొత్తగా ఉపాధ్యాయులను నియమించగలం, విద్యాప్రమాణాలు పెంచగలం. ఈ అరకొర నిధులతో వికసిత భారత్‌లో విద్యా వికాసం ఎండమావిలో నీటిని వెతికినట్లే ఉంటుంది. ఉద్యోగులపై ఆదాయ పన్ను విధానం కూడా మోసపూరితంగా ఉంది. పెద్దగా మార్పులేమీ లేవు. ధరల పెరుగుదలకు అనుగుణంగా పన్ను మినహాయింపు.. కనీస ఆదాయం పెంచకపోవడం, సెక్షన్ 80సీ పరిమితి పెంచక పోవడం ఉద్యోగులను నిరాశపరిచింది.

రాష్ట్రానికి మొండిచేయి చూపారు..

సీహెచ్ రాజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్ర ఊసేలేదు. దేశంలో అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన కేంద్ర ప్రభుత్వం బిహార్, అంధ్రప్రదేశ్ సీఎంలకు భయపడి పదవి కాపాడుకోవడానికి ఆయా రాష్ట్రాలకు బడ్జెట్లో పెద్ద పీట వేసింది. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి వెంటనే ఎంపీ పదవులకు రాజీనామా చేయాలి. రాష్ట్ర ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

వికసిత్ భారత్ నిర్మాణ లక్ష్యంగా బడ్జెట్

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



వికసిత్ భారత్ నిర్మాణమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరికి ఉపాధి, అంత్యోదయ అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర బడ్జెట్ ఉంది. పేదలు, యువత, అన్నదాతలు, మహిళలు, పన్ను చెల్లింపుదారులకు మేలు కలిగించడమే ధ్యేయంగా కేంద్రం పనిచేస్తోంది.

వికసిత్ భారత్ దిశగా కేంద్ర బడ్జెట్

పీవీ నారాయణరావు, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యంగా ఉంది. స్థిర ఆర్థిక వృద్ధి పెంపుదల, ఉద్యోగ అవకాశాలను పెంపొందించటంలాంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ద్రవ్యలోటును 4.9 శాతానికి అంటే.. జీడీపీపై 5 శాతం కిందకు తీసుకురావడం మంచి పరిణామం. రానున్న ఐదేళ్లలో 20 లక్షల నైపుణ్య యువతను తయారు చేయడం, ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకాల ప్రకటన, మరో 50 లక్షల ఉద్యోగ కల్పన ఒక శుభవార్త. మొబైల్స్, చార్జర్స్‌పై కస్టమ్ సుంకాన్ని తగ్గి తగ్గించడంతో ధరలు తగ్గే అవకాశం ఉంది. బంగారం, వెండిపై కూడా కస్టమ్ డ్యూటీ తగ్గించటంతో వాటి ధరల్లో మార్పు రావచ్చు.

ఇది మిశ్రమ బడ్జెట్

త్రిపురనేని గోపీచంద్, సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్, హనుమకొండ



కేంద్ర 2024-25 వార్షిక బడ్జెట్ సామాన్య ప్రజలకు, రైతులకు, విద్య, వైద్య రంగాలకు, మౌలిక వసతుల కల్పన, రోడ్లు, రైతు, విమానాశ్రయాలు, జలరవాణా, పోర్టుల అభివృద్ధి, మహిళా అభ్యున్నతి లక్ష్యంగా ఉంది. 2045 సంవత్సరం నాటికి వికసిత్ భారత్ సాధన దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, గృహనిర్మాణాలు, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర వాటికి కేటాయింపులు సంతృప్తికరంగా ఉన్నాయి. ఆదాయపు పన్నులో ఉద్యోగ వర్గాలకు రూ.17,500 నుంచి తగ్గింపు ప్రామాణితను రూ.75వేలకు పెంచడం పన్ను స్లాబులలో మార్పు మంచి చర్య. కానీ బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రాలను సమానంగా చూడకుండా బిహార్, ఆంధ్రప్రదేశ్, బెంగాల్, ఈశాన్య ప్రాంతాలకు అధిక కేటాయింపులు జరిపి తెలంగాణకు మొండిచేయి చూపడం అత్యంత బాధాకరం.

అస్తి అమ్మకంపై ఇండెక్సేషన్ తొలగింపు

తిప్పర్తి రాఘవ రెడ్డి, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్



అస్తి అమ్మకంపై ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తీసివేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. దీనివల్ల ఆస్తిని విక్రయించే చాలామంది ఇప్పుడు కొనుగోలు ధరను పెంచలేరు. వారి మూల ధరను తగ్గించలేరు. ప్రకటనకు ముందు ఆస్తి విక్రయం ద్వారా ఉత్పన్నమయ్యే దీర్ఘకాలిక మూలధన లాభాలపై ఇండెక్సేషన్ ప్రయోజనంలో 20 శాతం పన్ను విధింపబడింది. ఇప్పుడు బడ్జెట్ ప్రకారం ఇండెక్సేషన్ ప్రయోజనం లేకుండా కొత్త ఎల్‌టీసీజీ పన్నురేటు 12.5 శాతం ఆస్తిపన్నుపై మూల ధన లాభాలకు వర్తిస్తుంది.

విద్యారంగానికి నిధులు విస్మరించారు

కడారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెటిన వికసిత భారత్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించాల్సిన నిధులను విస్మరించింది. గత ఏడాది బడ్జెట్‌లో 2.61 శాతం నిధులను కేటాయించిన ఇదే కేంద్ర ప్రభుత్వం.. ప్రస్తుత బడ్జెట్‌లో మాత్రం 2.59 శాతం నిధులను మాత్రమే కేటాయించింది. 1964లో కొఠారి కమిషన్, 1980లో జాతీయ విద్యావిధానం, 2020లో నూతన జాతీయ విద్యా విధానం బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం నిధులను కేటాయించాలని స్పష్టం చేసినా అవేమీ పట్టించుకోలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో కేంద్రం కేటాయించిన నిధులతో విద్యార్థులకు నైపుణ్య ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం సాధ్యపడదు. ఈ నిధులతో కొత్తగా విద్యాసంస్థలను ఏర్పాటుచేసి మరిన్ని విద్యావకాశాలను కల్పించేందుకు అస్కారం లేదు.

ఉద్యోగులకు తీవ్ర నిరాశ

పెండెం రాజు, యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి



కేంద్ర బడ్జెట్ ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసింది. రూ.48లక్షల ఇరవై ఒక్క వేల కోట్ల బడ్జెట్‌లో ఉద్యోగులకు దక్కిందేమీ లేదు. ఏడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతీసారి ఉగ్యోగులకు చేదు అనుభవమే ఎదురవుతోంది. కనీసం 80సీ పరిమితిని కూడా పెంచలేదు. పాత పన్నుల విధానంలోనే కొత్త స్లాబులను మార్చారు. దీంతో ఉద్యోగస్తులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ప్రస్తుతం మెజారిటీ ఉద్యోగులు పాత పన్ను విధానంలోనే ఆదాయపు పన్నును చెల్లిస్తున్నారు. పన్ను చెల్లింపు దారులందరినీ ఎలాంటి లాభంలేని కొత్త పన్ను విధానంవైపు మళ్లించే విధంగా ప్రస్తుత బడ్జెట్ ఉంది.

ఓరుగల్లుకు అన్యాయం చేశారు..

రావుల శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాది, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి



కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు అన్యాయం చేశారు. కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ లాంటి వాటి ఊసే లేదు. ఈ బడ్జెట్‌లోనైనా కేటాయింపులు జరుగుతాయని ఆశించాం. కానీ నిరాశే మిగిలింది. జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా నిధులు కేటాయించకపోవడం వివక్షే. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఏ ఒక్క కేటాయింపు జరగలేదు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా మురళి

కేఎంసీ ప్రిన్సిపాల్‌గా రాంకుమార్‌రెడ్డి



డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, డాక్టర్ మురళి

వరంగల్ మెడికల్, జూలై 23: ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా అనస్థీషియా విభాగం ప్రొఫెసర్ చిలక మురళికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా కేఎంసీ ప్రిన్సిపాల్‌గా ఆర్థో విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ కాటం రామ్‌కుమార్‌రెడ్డికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఎంజీఎం ఆస్పత్రి ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ బదిలీపై ములుగు వైద్య కళాశాలకు ప్రొఫెసర్‌గా వెళ్లారు. దీంతో తాత్కాలికంగా ఎంజీఎం పరిపాలనతోపాటు చార్జి తీసుకునే విధంగా ప్రొఫెసర్ మురళీకి బాధ్యతలు అప్పగించారు. ప్రొఫెసర్ మురళి 2012లో ఎంజీఎంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు స్వీకరించి అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా ఇక్కడే పదోన్నతులు పొందారు. ప్రస్తుతం కేఎంసీ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పరిపాలన అధికారిగా కూడా డాక్టర్ మురళి కొనసాగుతున్నారు.

అలాగే కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆర్థో విభాగం హెచ్‌వోడీ డాక్టర్ కాటం రామ్‌కుమార్‌రెడ్డి ఇన్‌చార్జి హోదాలో నియమితులయ్యారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్ నర్సంపేట వైద్య కళాశాలకు బదిలీ కావడంతో ప్రస్తుతం వైస్ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే హనుమకొండలోని టీబీ అండ్ చెస్ట్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సునీత నియామకం అయ్యారు. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్.. నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధి బృందం రెండు రోజుల్లో నగరంలోని పలు బోధన ఆస్పత్రులను తనిఖీ చేయనున్న నేపథ్యంలో ఇన్‌చార్జి బాధ్యతలు సీనియర్ ప్రొఫెసర్లకు అప్పగించారు.

రుణమాఫీ కానివారు ఏఈవోలను సంప్రదించండి

జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్



డీసీసీబీలో రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న డీఏవో వినోద్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 23: మొదటి విడతలో అర్హులైన ప్రతీ రైతుకు రూ.1లక్ష లోపు రుణమాఫీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఘన్‌పూర్ డీసీసీబీ, శివునిపల్లి ఎస్‌బీహెచ్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి రుణమాఫీ అయ్యిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించిన రుణమాఫీని బ్యాంకర్లు వెంటనే అమలు చేయాలన్నారు. రుణమాఫీ పొందిన వారు తిరిగి రుణం తీసుకోవచ్చన్నారు. ఎమైనా సమస్యలు ఉన్నట్లైతే రైతులు ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో మొదటి విడత రుణమాఫీ సుమారు 26వేల మందికి వచ్చిందన్నారు. రెండో విడత ప్రారంభం కాకముందే వారు తిరిగి రుణాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో చంద్రన్‌కుమార్, బ్యాంకు మేనేజర్ మహబూబీ, సీఈవో మగ్దుం, కార్తీక్ పాల్గొన్నారు.

కొత్త రుణాల కోసం రైతుల ఇబ్బందులు



శివునిపల్లి బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదుట బారులు తీరిన రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 23: శివునిపల్లి పట్టణంలోని బ్యాంకు ఆఫ్ బరోడా వద్ద రుణమాఫీ పొందిన రైతులు కొత్త రుణాలు పొందడానికి మంగళవారం లైన్లలో నిలబడి ఇబ్బందులు పడ్డారు. జఫర్‌గడ్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించిన ఖాతాలు శివునిపల్లి బరోడా బ్యాంకులో ఉండడంతో వారు ఉదయం 10గంటలకే పెద్ద ఎత్తున తరలివచ్చి లైన్లలో నిలబడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఇబ్బంది అవుతోందని, వెంటనే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.

రూ. లక్ష ఎల్‌వోసీ అందజేత

బచ్చన్నపేట, జూలై 23: మండలంలోని కట్కూరు గ్రామానికి చెందిన కెంగెర్ల రవి కూతురు రిషిత గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, చికిత్స కోసం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో రూ. లక్ష ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను బీఆర్ఎస్ నాయకులు మునిని రాజుగౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, బాల్‌నర్సయ్య, తమ్మడి సురేష్, యాదగిరి, వెంకటయ్య, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.





చిలుపూర్ మండలం గార్లగడ్డ తండాలో అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్తున్న మహిళలు, నర్మెట మండలం సూర్యబండతండాలో నైవేద్యం తీసుకెళ్తున్న మహిళలు

తండాల్లో వైభవంగా సీత్లాభవాని పండుగ

చిలుపూర్, జూలై 23 : మండలంలోని గార్లగడ్డ తండాలో సీత్లాభవాని వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం దాటోడి (గొడ్లదాటుడు) పర్వదినాన్ని పురస్కరించుకుని గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి గ్రామ సమీపంలో ఉన్న సీత్లాదేవి ఆలయానికి నృత్యప్రదర్శనగా వెళ్లారు. సీత్లాదేవికి మొక్కులు చెల్లించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజన పూజారి భూక్య రాగ్య మాట్లాడుతూ, గిరిజనుల ఆరాధ్య దైవం సీత్లాదేవికి యేటా ఆషాఢమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీరంగారెడ్డి, మాజీ సర్పంచ్ భూక్య తులసి -భీమానాయక్, రవి, లాలూ, గేన్యా, భూక్య సంజీవ నాయక్, కొమురు, గంగారాం, భీముడు, మోహన్, శంకర్, కిషన్, తేజ్యా, మేగ్యా, సీతారాం, గోప్యా, రాజు, శ్రీరాంతో పాటు, గిరిజన మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నర్మెట: మండలంలోని సూర్యబండతండాలో మంగళవారం సీత్లా భవాని(దాటుడు) పండుగను గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ పొలిమేరలో గిరిజనుల ఆరాధ్య దేవతలు ఏడుగురిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. దేవతల వద్దకు సమూహంగా వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, తమ కుటుంబాలు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో తండ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ చామల జన్మదిన వేడుకలు



జనగామలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ రూరల్, జూలై 23: భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కేకు కట్ చేసి చామలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చెంచారపు బుచ్చిరెడ్డి, రాజమౌళి, మేడ శ్రీనివాస్, వంగాల కళ్యాణి, వంగాల మల్లారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎంపీ చామలను ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జనగామ నియోజకవర్గ రాజకీయ పరిణామాలపై చర్చించారు. వారిలో ఎర్రమల్ల సుధాకర్, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, కంచ రాములు ఉన్నారు.

తరిగొప్పుల: కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వగలబోయిన యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద కేక్ కట్ చేశారు. స్థానికులకు, ప్రయాణికులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పండుగ కనుకయ్య, అర్జుల మధుసూదన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, చిలువేరు సంపత్, పింగిళి నరేందర్ రెడ్డి, దామెర లూక పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ఎంపీ చామల జన్మదినం సందర్భంగా పార్టీ కార్యలయం వద్ద మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. పడమటికేశ్వాపూర్ మాజీ సర్పంచ్ గిద్దెల రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వాస్విక్ వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి ఢిల్లీలో ఎంపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జంగిటి విద్యానాథ్, ఎండీ మసూద్, నిడిగొండ శ్రీనివాస్, నల్లగోని బాలకిషన్‌గౌడ్, నల్లనాగుల వెంకటాచారి, భాగ్యలక్ష్మీ, పిన్నింటి కావ్యశ్రీరెడ్డి, గుర్రపుబాల్‌రాజ్, దిడిగ రమేశ్, ఎద్దు హరీష్, నీల రమేశ్, జంగిటి నరేష్, ఆముదాల మల్లారెడ్డి, మోహిన్‌రెడ్డి, అఖిల్ మాల, అంబాల ఆగయ్యగౌడ్, ఇజ్జగిరి రాములు తదితరులు పాల్గొన్నారు.

నర్మెట: ఎంపీ చామల జన్మదినం సందర్భంగా మండలకేంద్రంలో గ్రామ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్. లక్ష్మీనారాయణ, గొల్లపల్లి కుమారస్వామి, పరీదుల యాదయ్య, గొల్లపల్లి బాలచందర్, కూకట్ల చంద్రమౌళి, భూక్య జయరాం, బండి అశోక్, బైరగోని అంజయ్య, చెవుల పరుశరాములు, పల్లె ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులను సందర్శించిన అధికారులు

- రుణమాఫీ అమలు తీరుపై ఆరా



జఫర్‌గడ్ గ్రామీణ బ్యాంకులో రైతుల రుణమాఫీ నిధుల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో వెంకన్న



సింగరాజుపల్లి కేజీవీబీలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కొంరయ్య

జఫర్‌గడ్, జూలై 23 : స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్.వెంకన్న జఫర్‌గడ్‌లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకును సందర్శించారు. మంగళవారం ఆయన మండల తహసిల్దార్ అంబటి ఆంజనేయులుతో కలసి రైతుల రుణమాఫీ నిధుల జమపై వివరాలు తెలుసుకున్నారు. రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయా..? ఎంత మందికి మాఫీ అయ్యాయి..? రుణమాఫీ కింద ఎన్ని కోట్లు బ్యాంకులోని రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి..? వంటి వివరాలను తెలుసుకున్నారు. ఏపీజీవీబీ జఫర్‌గడ్ శాఖ బ్యాంకులో మొత్తం 630 మంది రైతులకు రూ.3 కోట్లు ఖాతాల్లో జమయ్యాయని, ఇప్పటి వరకు వంద మంది రైతులు డాక్యుమెంట్లను అందించారని, ప్రక్రియ కొనసాగుతోందని బ్యాంకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రుణమాఫీ పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంఆర్ఐ అనిల్‌కుమార్ ఉన్నారు.

దేవరుప్పుల: రుణమాఫీ డబ్బులు అందరికీ అందేలా చూడాలని జనగామ ఆర్డీవో కొంరయ్య అన్నారు. మంగళవారం ఆయన సింగరాజుపల్లి లో కాకతీయ గ్రామీణ వికాస్ బ్యాంకుతో పాటు దేవరుప్పులలోని యూనియన్ బ్యాంక్‌లను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు పడుతున్నయా లేదా అని తెలుసుకున్నారు. రుణమాఫీ డబ్బులను రైతులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, ఆర్ఐ రాజు, బ్యాంకు మేనేజర్లు ఉన్నారు.

మాయా జూదం!

(5వ పేజీ తరువాయి)

రమ్మీ, తిన్ పత్తా, అందర్ బాహర్ ఆటలతో పాటు క్రికెట్ తదితర బెట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. రమ్మీలో పాయింట్స్ రమ్మీ, పూల్ రమ్మీ, డీల్స్ రమ్మీ అని మూడు రకాల ఆటలుంటాయి. ఆన్‌లైన్ సైట్‌లో జూదం ఆడాలంటే.. ముందు ఫేక్ ఐడి క్రియేట్ చేసుకుంటారు. దీంతో వారు ఎక్కడి నుంచి ఆడుతున్న విషయం ఎవరికీ తెలియదు. తర్వాత ఆన్‌లైన్ రమ్మీ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటారు. ఫోన్-పే..లేక గుగూల్-పేలో డబ్బులు ఉంటే చాలు.. ఎంచక్కా..ఆన్‌లైన్‌లో మూడు రకాల రమ్మీ, తిన్ పత్తా, అందర్ బాహర్ ఆడడంతో పాటు క్రికెట్ బెట్టింగ్‌లు కాస్తారు. ఆన్‌లైన్ జూదంలో ఎంత ఆడదల్చుకుంటే అంత డబ్బు ఐడి నెంబర్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తారు. ఆన్‌లైన్ జూదం రమ్మీ ఆటలో ఒకసారి అంటే గంటలోపు రూ.10 వేల నుంచి రూ.90 వేల వరకు పెట్టి ఆడతారు. ఉదాహరణకు రమ్మీ ఆటలో ఏడుగురు వ్యక్తులు రూ.10 వేల చొప్పున పెట్టి ఆడితే రూ.70 వేల గేమ్ అవుతుంది. ఒక ఆట గంటలోపై అయిపోతుంది.. గెలిస్తే రూ.70 వేలు వస్తాయి.. లేదంటే రూ.10 వేలు పోతాయి. అలాగే తిన్ పత్తా ఆటలో అయితే బ్లైండ్‌లో రూ.100, సీన్‌లో అయితే డబుల్ అంటే రూ.200 చొప్పున పది సార్లు వేస్తే పది నిమిషాలలో రూ.2 వేలు పోతాయి. ఒక వేళ గెలిస్తే వచ్చే డబ్బులలో నిర్వాహకులు 3 నుంచి 5 శాతం కమీషన్ తీసుకొని మిగిలిన మొత్తం ఇస్తారు. ఆన్‌లైన్ గేమ్ ప్రతీ రోజు 24 గంటలు అందుబాటులో ఉంటుంది. ఒక్కోసారి ఒక్క రోజులోనే రూ.90 వేల నుంచి రూ.2 లక్షల వరకు పొగొట్టుకున్న వారు ఉన్నారు. ఇంట్లో వారికి తెలియకుండానే అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్‌లో ఏదో ఒక రోజు అదృష్టం కలిసి రాకపోతుందా అనే ఆశతో ఆడి.. చివరకు అప్పులే మిగలడంతో అటు అప్పులు తీర్చలేక.. ఇటు కుటుంబసభ్యులకు చెప్పలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్ గేమ్ పట్ల ముఖ్యంగా యువత ఆకర్షితులవుతున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లో పెట్టుబడులు పెట్టిన వారు నిండా మునుగుతున్నారే తప్ప లాభపడిన వారు ఎవరూ లేరని ఈ ఆట ఆడిన వారే ఒప్పుకుంటున్నారు. ఆన్‌లైన్ గేమ్‌ల వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రతీ ఒక్కరికి తెలిసేటట్లు చేయడానికి అధికారులు, పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు..

ఎ.శ్రీనివాస్ యాదవ్, సీఐ, రఘునాథపల్లి



యువత ఆన్‌లైన్ గేమ్‌లు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఈ విషయంలో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. సోషల్ మీడియాలో వ్యక్తిగత వీడియోలను అప్‌లోడ్ చేయవద్దు. లోన్ యాప్‌లను డౌన్ లోడ్ చేసుకుంటే మన వ్యక్తిగత సమచారం వారికి తెలిసి పోయే ప్రమాదముంది. తర్వాత మనల్ని వారు బ్లాక్‌మెయిల్ చేసే అవకాశముంటుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో అపరిచిత వ్యక్తులు ఫ్రైండ్ రెక్వెస్ట్ పెడితే యాక్సెప్ట్ చేయొద్దు. సైబర్ నేరాలకు గురయితే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలి.

నేడు నాస్తిక సమాజం రాష్ట్ర మహాసభలు

పాలకుర్తి, జూలై 23 : హన్మకొండలోని పీఆర్‌రెడ్డి భవన్‌లో భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు గుమ్మడిరాజు సాంబయ్య కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మూఢ విశ్వాసాలను తొలగించేందుకు నాస్తిక సమాజం ఆధ్వర్యంలో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు మండలం నుంచి వందలాదిగా తరలిరావాలని కోరారు.

'అనవసరమైన పోస్టులు పెడితే చర్యలు'

దేవరుప్పుల, జూలై 23: సోషల్ మీడియాలో అనవసరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సృజన్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఎవిడెన్స్ లేకుండా ఎవరినైనా కించ పరిచేలా పోస్టులు పెడితే సహించేది లేదన్నారు. అదే విధంగా ఆటో డ్రైవర్లు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, ఫోర్ వీలర్ నడిపేవారు బెల్టులు బిగించుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.

'ముదిరాజ్‌లను బీసీ ఏ లో చేర్చాలి'

చిలుపూర్, జూలై 23 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్‌లను బీసీ -డి నుంచి బీసీ -ఏ లో చేర్చాలని ముదిరాజ్ సంఘం జిల్లా ప్రమోటర్ నీల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించి తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కండ్లకోలు శ్రీనివాస్, జంగిటి కుమారస్వామి, కండ్లకోలు బాలరాజు, గొడుగు కరుణాకర్, యాకస్వామి, నాచు రాజు, పోలు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మహాసభను జయప్రదం చేయండి'

జనగామ రూరల్, జూలై 23: ఆగస్టు 9న హైదరాబాద్‌లో నిర్వహించే సేవాలాల్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట పోస్టర్లను అవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే నేరవేర్చాలన్నారు. రాష్ట్ర మహాసభకు సేవాలాల్ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధరావత్ రమేష్, అనిల్ చౌహాన్, బానోత్ ఆశోక్, తదితరులు పాల్గొన్నారు

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు

నర్మెట, జూలై 23 : మండలంలోని హన్మంతపూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు మంగళవారం పలు సూచనలు చేశారు. వరిలో వచ్చే తెగుళ్ల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పత్తి సాగులో చీడపీడల నివారణ గురించి సలహాలు ఇచ్చారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ జూమ్ మీటింగ్‌లో ఏవో, ఏఈవోలకు రైతు బీమాపై సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సంతోషి, ఏఈవోలు అనిత, జగదీష్, భవాని, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణాల్లో తనిఖీలు

తరిగొప్పుల, జూలై 23: మండల కేంద్రంలో మాంసం విక్రయించే దుకాణాలను మండల పశువైద్యాధికారి ప్రియాంక పంచాయతి అధికారులతో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యర్థ పదార్థాలు ఇష్టరీతిన పడేయడంతో యజమానులను హెచ్చరించారు. వర్షకాలం సీజన్ కావడంతో మాంసం షాపు యజమానులు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నవారు వెంటనే లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బండి భాగ్యలక్ష్మి, కారోబారు జల్లి సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం

కరపత్రాల ఆవిష్కరణలో తహసీల్దార్ ఆంజనేయులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు, వినియోగదారుల మండలి రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

జఫర్‌గడ్, జూలై 23 : రాబోయే వినాయకచవితి పర్వదినం పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకుల ప్రతిమలనే పూజించాలని జఫర్‌గడ్ తహసిల్దార్ అంబటి ఆంజనేయులు, విని యోగదారుల సమాచార కేంద్రం హన్మకొండ జిల్లా అధ్యక్షుడు ఠాకూర్ రతన్ సింగ్ కోరారు. వినియోగదారుల, పర్యావరణ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక నష్టాలు జరుగుతున్నాయన్నారు. పర్యావరణం దెబ్బతిని మానవాళి మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల అనేక వ్యాధులు సంభవిస్తాయన్నారు. వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాల్లో ప్లాస్టిక్ ఉపయోగించే రసాయనిక విగ్రహాల వాడకం, నిమజ్జనం వల్ల జల, వాయు కాలుష్యంతో పర్యావరణం దెబ్బతింటుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు అందరూ నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ బాసెట్టి హరిప్రసాద్, వినియోగదారుల సమాచార కేంద్రం ధర్మసాగర్ మండల అధ్యక్షుడు కందుకూరు విజయరావు, జిల్లా విజిలెన్స్ కమిటి సభ్యులు బండ కాళిదాసు, చేరాల సర్వేషం, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ అన్నెబోయిన బిక్షపతి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ మంచాల అయిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

శాసనమండలి

బీఆర్ఎస్ పక్ష నేతగా 'సిరికొండ'



భూపాలపల్లిటౌన్, జూలై 23: శాసన మండలిలో బీఆర్ఎస్ పక్ష నేతగా సిరికొండ మధుసూదనాచారిని ఎంపిక య్యారు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. తెలంగాణ తొలి మాజీ స్పీకర్‌గా మధుసూదనాచారి కొనసాగారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధుసూదనాచారిని శాసన మండలి బీఆర్ఎస్ పక్ష నేతగా ఎంపిక చేశారు. బీఆర్ఎస్‌లో సిరికొండ బలమైన నేతగా కొనసాగుతున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో తన మార్కును చాటుకుంటున్నారు. ఆయన ఎంపిక పట్ల పార్టీ ముఖ్యనేతలు చింతల రమేష్, బండారి రవి, గోపు బిక్షపతి, లెంకల రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

ఏడీఏ పరశురామ్

పాలకుర్తి, జూలై 23: జిల్లావ్యాప్తంగా రైతులందరూ రైతుబీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని పాలకుర్తి ఏడీఏ పరశురామ్ నాయక్ సూచించారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ ఆగస్టు 5వ తేది లోగా దరఖాస్తులను సమర్పించాలని కోరారు. జూన్ 28 లోగా పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులతో పాటు గతంలో రైతు బీమాకు దరఖాస్తు చేయని వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. రైతు బీమాలో నామినీ మరణించినా, నామినీలో మార్పులు చేర్పులు చేయాల్సి ఉన్నా 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు బీమా కోసం 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయసున్న రైతులు ఆగస్టు 5 లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రైతు బీమా దరఖాస్తు ఫారం, పట్టా పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి

జనగామ రూరల్, జూలై 23: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమవీరులైన కుటుంబాలకు బడ్జెట్లో నిధులు కేటాయించి వారిని అదుకోవాలని జనగామ జేఏసీ నాయకులు మంతెన మణి కుమార్, వంగ భీమ్ రాజ్ ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరులైన 1200 మంది ఉద్యమకారుల కుటుంబాలను ప్రభుత్వం అదుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అమరవీరుల కుటుంబాలకు, వారి తల్లిదండ్రులకు రూ.25,000 పింఛన్, ఉచిత విద్య, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్న హామీలను వెంటనే నేరవేర్చాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలన్నారు.

దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రపై సినిమా

జనగామ రూరల్, జూలై 23: తెలంగాణ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం అమరుడైన దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ఆధారంగా సినిమాను నిర్మిస్తున్నామని డైరెక్టర్ సేనాపతి అన్నారు. జిల్లా కేంద్రంలోని కురుమ సంఘం భవనంలో మంగళవారం సినిమా నిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సేనాపతి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నేలరాలిన తొలి రక్తపు చుక్క దొడ్డి కొమురయ్య అన్నారు. ఆయన పోరాట ప్రతిభను ప్రపంచానికి తెలిసేలా సినిమా తీస్తున్నానని తెలిపారు. అనంతరం సినిమాలో నటించేందుకు నటీనటులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో బాల్దే మల్లేషం, కర్రె శ్రీనివాస్, జాయ మల్లేశ్, జూకంటి శ్రీశైలం, కేమిడి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పూర్వ విద్యార్థి చేయూత

రూ.2లక్షల విలువైన స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న పూర్వ విద్యార్థి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 23: మండలంలోని తాటికొండ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు పూర్వ విద్యార్థి సయ్యద్ ఇలియాస్ అలీ రూ.2లక్షల విలువైన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం హెచ్ఎం కొడ రాజేందర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలను మరువకుండా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంజిత్, మురళి, రుద్రమదేవి, అనసూయ, శ్రీనివాస్, పీడీ గిరెడ్డి ప్రమోద్ రెడ్డి, సల్లవుద్దీన్, సువర్ణ, రాణి, రవి పాల్గొన్నారు.

కాల్వను కబ్జా చేసిన వారిని శిక్షించాలి

దేవరుప్పుల, జూలై 23 : కెనాల్ భూమిని కొంత మంది ఆక్రమించుకొని రోడ్డు వేశారని, రైస్ మిల్లు కట్టాలని ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆరోపించారు. మంగళవారం ఆయన ఆయన కామారెడ్డి గూడెం శివారులో కబ్జా చేసిన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో కాలువ కోసం సర్వే చేసి అట్టి భూముల రైతులకు పరిహారం చెల్లించి ప్రభుత్వం కాల్వలు తవ్వించిందన్నారు. కొంత మంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కాల్వలు తవ్వనివ్వకుండా అడ్డుపడి కబ్జాలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. కాల్వల ద్వారా నీరు వెళ్లకుండా చేశారని అన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్మారెడ్డి, భూక్యా సజ్జన్, నాగరాజు, రాజు, రమేష్, అనిల్ ఉన్నారు.

రహదారిపై గుంతలను పూడ్చిన పోలీసులు

లింగాలఘణపురం, జూలై23: మండలంలోని జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై మంగళవారం లింగాలఘణపురం ఎస్సై చింత రాజు ఆధ్వర్యంలో పోలీసులు గుంతలను పూడ్చివేయించారు. గత మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బీటీ రోడ్లపై అనేక చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండటంతో అప్రమత్తమైన పోలీసులు రోడ్డుప్రమాదాలను నివారించేందుకు రోడ్లపై గుంతలను పూడ్చుతున్నారు.